

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ క్యాంపస్‌లలో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ఖాసీంబేగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి ఎంపికలు ఈ నెల 16 నుంచి 19 వరకు, జిల్లాస్థాయి ఎంపికలు 25, 26 తేదీల్లో సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాక, జూన్10(ఆంధ్రజ్యోతి): నూతన ఆర్ఓఆర్ చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభించనున్నదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో జరిగిన భూభారతి సదస్సుకు హాజరై రైతుల భూ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై అందిన ఫిర్యాదులను ఎలా, ఎప్పుడు, ఎన్నిరోజుల్లో పరిష్కరిస్తారో తెలియజేసే అంశాలను చట్టంలో పొందుపరిచారన్నారు. దీంతో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 20 వరకు జరగనున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దుబ్బాకలోని సివిల్ ఆసుపత్రి, మండలంలోని హబ్షీపూర్ రేషన్ దుకాణాన్ని కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులను అడిగి వైద్యసేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి వెనకాల ప్రహరీ, సెప్టిక్ ట్యాంక్ మరమ్మతులు, ఆక్సిజన్‌ప్లాంట్ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దుబ్బాక తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ తదితరులున్నారు.



అప్పనపల్లి గ్రామంలో భూ భారతి అవగాహన సదస్సులో కలెక్టర్ మనుచౌదరి





టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తోపాజీ అనంతకిషన్‌ను సన్మానిస్తున్న జగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా
నియమితులైన తోపాజీ అనంతకిషన్

అనంతకిషన్‌ను సన్మానించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంగారెడ్డికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోపాజీ అనంతకిషన్ నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎనిమిదేళ్లు పనిచేసిన తోపాజీ అనంతకిషన్ ఇప్పటి వరకు టీపీసీసీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న తోపాజీ అనంతకిషన్ సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తోపాజీ అనంకిషన్‌కు అభినందనలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జార్జ్, కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సందడిగా స్విమ్మింగ్ ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని జిల్లా క్రీడాధికారి సంస్థ స్విమ్మింగ్‌పూల్‌లో సబ్ జూనియర్, జూనియర్ క్రీడాకారులకు జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐదు సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల లోపు మొత్తం 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫ్రీ స్టైల్ 50, 100, 200 మీటర్లు, బటర్ ఫ్లై 50, 100, 200 మీటర్లు, బెస్ట్ స్ట్రోక్ 50, 100, 200 మీటర్లు, బ్యాక్ స్ట్రోక్ 50, 100, 200 మీటర్ల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్, బహుమతులను అందజేశారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.




మాకేది పదవి!

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నూతన కార్యవర్గంపై ఉమ్మడి మెదక్ జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులుగా 69 మంది, ఉపాధ్యక్షులుగా 27 మందికి జాబితాలో చోటు కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 96 పదవుల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు ఏడు దక్కడం విశేషమే. అయితే, ఈ పదవులన్నీ కేవలం సంగారెడ్డి జిల్లా నేతలనే వరించడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 10 నియోజకవర్గాలుండగా పటాన్‌చెరు నియోజకవర్గానికే 4 పదవులు కేటాయించడం గమనార్హం. సిద్దిపేట, మెదక్ జిల్లాల కాంగ్రెస్ నాయకులకు ఈ కార్యవర్గంలో చోటు లభించలేదు.

సంగారెడ్డి జిల్లాకే ఏడు పదవులు

- పటాన్‌చెరు నియోజకవర్గ నేతలే నలుగురు
- అనూహ్యంగా గాలి అనిల్‌కుమార్‌కు ఛాన్స్
- సిద్దిపేట, మెదక్ జిల్లాల నాయకులకూ మొండిచెయ్యి



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 10: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన టీపీసీసీ నూతన కార్యవర్గ జాబితాను చూసి ఆశావహులు నిరాశ చెందుతున్నారు. జిల్లాలు, నియోజకవర్గాలు, సామాజిక వర్గాలు, గత నేపథ్యాలను పరిగణనలోకి తీసుకొని పదవుల పంపకం చేపడతారని అంతా భావించారు. అయితే అందుకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జాబితా ఉందని పెదవి విరుస్తున్నారు. మరింత మందికి చోటు కల్పించాలని అధిష్ఠానానికి మొరపెట్టుకుంటున్నారు.

అందరూ సంగారెడ్డి జిల్లా నేతలే..

తాజాగా విడుదలైన టీపీసీసీ జాబితాలో చోటు దక్కించుకున్నవారంతా అనూహ్యంగా తెరమీదకు వచ్చిన వారే. పార్టీ ఉపాధ్యక్షులుగా గాలి అనిల్‌కుమార్, ఎంఏ ఫహీమ్, చిన్నపట్ల సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శులుగా ఏ.సంజీవ్‌ముదిరాజ్, శశికళ యాదవరెడ్డి, డాక్టర్ గిరిజా షెట్కార్, తోపాజీ అనంతకిషన్‌లను నియమించారు. వీరిలో అనిల్‌కుమార్, ఫహీమ్, సంజీవ్ ముదిరాజ్, శశికళ నలుగురూ పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందినవారే. మైనార్టీ కోటాలో ఫహీమ్, ముదిరాజ్

మిగతా 7వ పేజీలో



ఇంటర్ విద్యపై 'నిఘా'

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు

దుబ్బాక, జూలై10(ఆంధ్రజ్యోతి): ఇక నిఘానేత్రాల పర్యవేక్షణలోనే ఇంటర్ విద్య కొనసాగనున్నది. పారదర్శకత కోసం జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 20 కళాశాలలకు అవసరమైన కెమెరాల సంఖ్యను తెలుపాలని ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లను అధికారులు ఆదేశించారు. తరగతి, అధ్యాపకులు, తదితర గదులతోపాటు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలోని 43 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను బిగించారు. జిల్లావ్యాప్తంగా ఇంటర్ కళాశాలల్లో సుమారు 245 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్వహణ హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోలర్ నుంచే చేపట్టనుండగా, విద్యార్థుల హాజరు, అధ్యాపకుల బోధన తీరు తదితరాలను పరిశీలించనున్నారు.

బడికి వెళ్దాం.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం..

సముదాయించడం సవాలే..

7



ప్రతి రైతుకూ ఫార్మర్ ఐడీ

- రైతువేదికల్లో ముమ్మరంగా రిజిస్ట్రీ
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తప్పనిసరి
- పాస్ పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు వర్తింపు
- సాంకేతిక సమస్యతో రైతులు అయోమయం

7



ఉచిత యోగా శిక్షణ


సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్,

వ్యాస మహర్షి యోగా సొసైటీ,

భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ..

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ప్రతినిధులు

8



మా కళాశాలలో చేరండి

- జగదేవ్‌పూర్ ప్రభుత్వ కళాశాల సిబ్బంది ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి అవగాహన.. స్పాటలోనే అడ్మిషన్

'విశాలమైన తరగతి గదులు.. ఆవరణలో పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం.. క్రీడామైదానం, అధునాతన ప్రయోగశాలలు.. వంటి సకల సౌకర్యాలున్నాయి. నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నది. మా కళాశాలలో చేరి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుండి..' అంటూ ఊరూరూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది. ప్రైవేటు కళాశాలలకు దీటుగా వినూత్నంగా ప్రచారం చేస్తూ విద్యార్థుల ఇళ్ల వద్దనే స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

-జగదేవ్‌పూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి)

కళాశాల ప్రిన్సిపల్ రాజన్న, అధ్యాపకులు కలిసి అడ్మిషన్ల కోసం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 5 టీంలుగా ఏర్పడి ఒక్కొక్క టీం రోజుకు ఒక గ్రామం చొప్పున వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని గ్రామాలతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి, రాజాపేట మండలాల్లోనూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నేరుగా కలిసి అవగాహన కల్పించి మా కళాశాలో చేరాలని కోరుతున్నారు. సానుకూలంగా ఉన్న విద్యార్థులకు ఇంటివద్దనే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. కుల ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, బోనఫైడ్స్ సర్టిఫికెట్, పాస్‌ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను సేకరించి స్పాట్ అడ్మిషన్లు చేస్తున్నారు.



జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ బానోతు రాజన్న



కళాశాలలోని కోర్సులు..

జగదేవ్‌పూర్ ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. నూతనంగా ఎంఈసీ, పీహెచ్‌డబ్ల్యూ ప్రవేశపెట్టారు. కళాశాలలో అర్హత కలిగిన అధ్యాపకులతో విద్య బోధన, విద్యార్థులకు ఆయా క్రీడల్లో శిక్షణ, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, విశాలమైన ఆటస్థలం, లైబ్రరీ సౌకర్యం, అధునాతన ప్రయోగశాలలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం, ఎంసెట్, జేఈఈ వివిధ పోటీ పరీక్షలకు ఉచిత గైడెన్స్ యోగా కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్ సెమినార్ల నిర్వహణ ఉంటుంది.

బస్సు సౌకర్యం కల్పిస్తే...

జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు బస్సు సౌకర్యం కల్పిస్తే మరింత మంది విద్యార్థులు కళాశాలలో చేరే అవకాశం ఉన్నది. జగదేవ్‌పూర్ నుంచి భువనగిరి వెళ్లే ప్రధాన రహదారిలో

- మిగతా 8వ పేజీలో...

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయపోల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు ఈ ఏడాది రెండు ఇంటర్ ఒకేషనల్ కోర్సులు మంజూరయ్యాయి. ఈ మేరకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఎంఏ, ఎంఎస్సీలో బీఈడీ చేసినవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. నర్సింగ్ కోసం బీఎస్సీ నర్సింగ్ చదివి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 13 లోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అల్లీపూర్ కేజీబీవీలో..

చిన్నకోడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీపూర్ కేజీబీవీలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి యాదవరెడ్డి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నీలిమ మంగళవారం తెలిపారు. ఇంటర్ సీఈసీ గ్రూపును ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభిస్తున్న నేపథ్యంలో తెలుగు, ఆంగ్లం, ఎకనామిక్స్ కామర్స్, సివిక్స్ సబ్జెక్టుల బోధనకు మహిళా అధ్యాపకులకు కావాలన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలని, ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

హుస్నాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం పూసాల శ్రీనాథ్ తెలిపారు. 3వ తరగతిలో 20, 4లో 15, 5లో 20, 6లో 15, 7లో 15, 8లో 15, 9వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



పట్నాలు వేసి.. ప్రణమిల్లి..

నెల రోజుల పాటు జరుగుతున్న హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర బుధవారం ముగియనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం జాతరకు భక్తులు పోటెత్తారు. ఆలయం నుంచి ఎల్లమ్మ చెరువు వరకు టెంట్లు, చెట్ల కింద విడిది చేశారు. అమ్మవారి దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం పట్టింది. పట్నాలు, ఒడి బియ్యం, బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నేటి ముగింపు కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.

- హుస్నాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి)





సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

● ఆర్టీసీ ఆర్ఎం విజయభాస్కర్



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఆర్ఎం విజయభాస్కర్

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషి తోనే సంస్థ అభివృద్ధి సాధ్యమని ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను సందర్శించి ఉద్యోగులు, సిబ్బంది పనితీరును సమీక్షించి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటి సిబ్బందితో కలిసి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఇటీవల నిజాయితీ చాటుకున్న కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బసవరాజును ఆర్ఎం విజయభాస్కర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎం ఉపేందర్, ట్రాఫిక్ మేనేజర్ సువర్ణ భాయ్, ఎంఎఫ్ అహ్మద్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోను ఆర్ఎం విజయభాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట డీఎం మల్లేశయ్య, మెకానికల్ ఇంజనీర్ దశరత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, డీసీ రాములు తదితరులు ఉన్నారు.

అప్పులు తీర్చలేక దొంగతనాలు

● రెండురోజుల వ్యవధిలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ, సీఐ

మనోహరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటుపడి, అప్పులు పాలై, అవి తీర్చలేక వృద్ధురాలి మెడలోంచి బంగారాన్ని దొంగిలించిన నిందితులను పోలీసులు రెండురోజుల వ్యవధిలోనే పట్టుకున్నారు. మంగళవారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ నిందితుల వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోప్పులపల్లి గ్రామానికి చెందిన బాదనపురం పెంటయ్య(30) ట్రాక్టర్ డ్రైవర్. కాగా వట్టూరు గ్రామానికి చెందిన పాంబండ వరలక్ష్మి(30)తో మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. పెంటయ్య గతంలో ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి ఆర్థికంగా నష్టపోయాడు. అప్పులభారం పెరగడంతో చేసేదేమీ లేక దొంగతనాలకు చేయడం ప్రారంభించాడు. గతంలో కామారెడ్డిలో బైక్‌ను దొంగిలించాడు. పెంటయ్య చేసే ప్రతీ పనికి వరలక్ష్మి తోడుగా ఉండేది. ఈనెల 7న సిద్దిపేట జిల్లా గజ్వేల్ బస్టాండ్ వద్ద కొత్తపల్లికి చెందిన వృద్ధురాలు రామవ్వకు మాయమాటలు చెప్పి బైక్ ఎక్కించుకున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పర్కిబండ శివారులోని క్యాత్యాయని ఆలయం వద్దకు చేరుకుని ముగ్గురూ మద్యం సేవించారు. ఇదే అదునుగా భావించి వృద్ధురాలి మెడలోని తులం బంగారం, 50 తులాల వెండి, అరతులం చెవి కమ్మలను దోచుకుని పారిపోయారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా మంగళవారం మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రెండురోజుల వ్యవధిలోనే చోరీ కేసును ఛేదించిన సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్, కానిస్టేబుల్ గోవర్ధన్‌గౌడ్, రాధాకృష్ణ, బిక్షపతిని డీఎస్పీ అభినందించారు.



మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ

భూసేకరణ వేగవంతం చేయాలి

● ఇండస్ట్రీయల్ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్

ఝరాసంగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం-న్యాల్‌కల్ మండలాల్లో చేపట్టే నిమ్జ్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇండస్ట్రీయల్ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్, ఐఎఫ్ఎస్ అధికారి డా.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం-న్యాల్‌కల్ మండలంలో ఏర్పాటవుతున్న మండలంలోని బర్దీపూర్, చీలపల్లి, ఎల్గోయిగ్రామ శివారులో గల నిమ్జ్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్జ్ పరిధిలో ఏయే గ్రామాల్లో ఎంతెంత భూసేకరణ చేపట్టారని నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఏయే గ్రామాల్లో భూసేకరణ చేపడుతున్నారని అడిగారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంరెడ్డి, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దత్తగిరిలో బ్రహ్మకమల వికాసం

ఝరాసంగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బర్దీపూర్‌లో మంగళవారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఆశ్రమంలో వికసించిన బ్రహ్మ కమలానికి ఆశ్రమ పీఠాధిపతి, అవధూత గిరిమహరాజ్, సిద్దేశ్వరానందగిరి మహరాజ్ భక్తులతో కలిసి ప్రత్యేక పూజలుచేసి మంగళహారతి నిర్వహించారు. పౌర్ణమిరోజు బ్రహ్మ కమలం వికసించడం ఆనంద దాయకమని పీఠాధిపతులు, భక్తులు పేర్కొన్నారు.



బ్రహ్మకమలానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అవధూతగిరిమహరాజ్

ఇసుక ఫిల్టర్లపై రెవెన్యూ అధికారుల కొరడా

కంది, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో సోమవారం రాత్రి రెవెన్యూ అధికారులు ఇసుక ఫిల్టర్లపై కొరడా ఝుళిపించారు. బ్యాతోల్‌లో కృత్రిమ ఇసుక తయారు చేసి జోరుగా దందా కొనసాగిస్తున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే తహసీల్దార్ రవికుమార్ ఇసుక ఫిల్టర్లను కూల్చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఐ రంగయ్య, సంగారెడ్డి రూరల్ పోలీసులతో కలిసి కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న అన్ని ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేయించారు. ఇసుక ఫిల్టర్లలో ఉండే ఇనుప జాలీలను విరగ్గొట్టారు. అనంతరం దళారులు అక్రమంగా నిర్మించుకున్న గుడిసెలను కూల్చివేశారు. దళారులు నిల్వచేసిన ఇసుక కుప్పలను, సామగ్రిని స్వాధినం చేసుకున్నారు. ఈ కూల్చివేతల్లో ఆర్ఐ రంగయ్య, రెవిన్యూ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



కంది మండలం బ్యాతోల్‌లో సోమవారం రాత్రి ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న మెదక్ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...చీటింగ్ కేసులు, యాక్సిడెంట్, గొడవ, వివాహ బంధం, కరోనా సమయంలో నమోదైన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చాన్నారు.

అడవి పందిని బంధించిన వ్యక్తి అరెస్ట్

శివ్వంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వల ఏర్పాటు చేసి అడవి పందిని బంధించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని, రెండు బైక్‌లను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన చిన్నగొట్టిముక్లలో మంగళవారం చోటు చేసుకుంది. శివ్వంపేట సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ ఆచార్య తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల శివారులో అడవి పందులను పట్టేందుకు వల ఏర్పాటు చేశారన్న సమాచారంతో అక్కడికి చేరుకున్న నర్సాపూర్ రేంజ్ అటవీశాఖ సిబ్బంది, అక్రమార్కులు వలలో బంధించిన అడవి పందిని వదిలేశారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పరారయ్యారని ఎఫ్ఎస్‌వో శ్రీధర్‌ఆచార్య తెలిపారు.

మట్టి పరీక్షలతో మంచి ప్రయోజనాలు

పాపన్నపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు మట్టి పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధి ఎల్లాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో శాస్త్రవేత్తలు మహేంద్రకుమార్, ప్రసాద్, సాయిప్రసాద్, చిన్నబాబు, రవికుమార్, ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ అంబికా సోని, ఏడీఏ విజయనిర్మల పాల్గొన్నారు.

ఘనపూర్‌లో వ్యక్తి దారుణహత్య

● పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం
● ఆస్తి తగాదాలతో తమ్ముడు కొడుకే నిందితుడు
● ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
● ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

పటాన్‌చెరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి తగాదాలతో పెదనాన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించాడో యువకుడు. బాధితుడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ వివరాల ప్రకారం.. ఘనపూర్ గ్రామానికి చెందిన చెర్ల రాములు(55) రామచంద్రాపురంలో నివాసముంటున్నాడు. రాములు సోదరుడు క్రిష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అతని భార్య కుమారులు ఘనపూర్ గ్రామంలో నివాసముంటున్నారు. ఇంట్లో తన వాటా కోసం రాములు ఈనెల 4న ఘనపూర్ రావటంతో అన్న కుమారుడు దిలీప్(18)తో గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహానికి గురైన దిలీప్ రాములుపై దాడిచేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మద్యం మత్తులో ఉన్న రాములు అతని బారి నుంచి తప్పించుకోలేకపోవడంతో దాదాపు 50 శాతం కాలిపోయాడు. వెంటనే అతన్ని స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి అతను మృతిచెందాడు. ఈ మేరకు బీడీలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాములు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

కొల్చారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొనడంతో హోంగార్డు మృతిచెందిన సంఘటన మండలంలోని మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారి పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లే టీ జంక్షన్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహ్మద్‌గౌస్ వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మెగావత్ శివరాం(44) హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల డిప్యూటేషన్‌పై మెదక్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఎప్పటిలాగే ఉదయం బైక్‌పై శివరాం కౌడిపల్లి నుంచి మెదక్ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెదక్ నుంచి పటాన్‌చెరుకు వెళ్తున్నది. ఏడుపాయల టీజంక్షన్ వద్దకు రాగానే శివరాం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో శివరాం తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన సింగం మల్లేష్(49) మిర్జాపల్లి శివారులోని తన పొలం వద్దకు చెట్లు నరకడానికి సోమవారం వెళ్లాడు. రాత్రి అవుతున్నా ఇంటికి రాలేదు. కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. మృతునికి భార్య లక్ష్మీనరసవ్వ, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

వర్గల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో జరిగిన గొడవలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బేగంపేట ఎస్ఐ మహిపాల్ వివరాల ప్రకారం.. వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన లింగస్వామి కుమారుడు సాయికిరణ్ (20) సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలించగా గ్రామ శివారులోని వారి వ్యవసాయ పొలం వద్ద వేప చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సాయికిరణ్ మృతదేహం

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నారాయణఖేడ్. జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం దాడి నిర్వహించి ఆరుగురు పేకాటరాయిళ్లను అరెస్టుచేసి, వారి నుంచి రూ.8,100 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. జగన్నాతపూర్ శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో తమ సిబ్బందితో ఈ స్థావరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు.

'మెరుగైన వైద్య సేవలందించాలి'

పాపన్నపేట జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. మంగళవారం మండల పరిధి పొడ్చన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి హరిప్రసాద్, వైద్యులు దీక్షా, ప్రదీప్, సూపర్‌వైజర్ అలీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



బడికి వెళ్దాం.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం.. సముదాయించడం సవాలే..

జోగిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో పుస్తకాలను అటకెక్కించి ఆటపాటలతో గడిపిన విద్యార్థులు గురువారం నుంచి మళ్లీ బడిబాట పట్టనున్నారు. ఆటవిడుపునకు సెలవిచ్చి పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు ఇప్పటికే తల్లిదండ్రులు వారిని సిద్ధం చేస్తున్నారు. సుమారు 50 రోజుల పాటు పుస్తకాలకు, బడికి దూరంగా ఉన్న విద్యార్థులు మళ్లీ పాఠశాలలకు వెళ్లాలంటే ఒకరకమైన బద్ధకం ఆవరిస్తుంది. ముఖ్యంగా చిన్నారులు బడికి వెళ్లనని మారాం చేస్తుంటారు. అలాంటి వారిని సముదాయించి తిరిగి స్కూళ్లకు పంపడం తల్లిదండ్రులకు ఒకవిధంగా సవాలే. విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా మళ్లీ బడికి వెళ్లేందుకు కొంత శ్రద్ధ చూపితే చాలంటున్నారు విద్యావేత్తలు.

ఉపాధ్యాయులే కీలకం..

చిన్నారులు మామూలుగా తరగతి గదుల్లో ఇమిడిపోవాలంటే తల్లిదండ్రులకంటే ఉపాధ్యాయుల పాత్రే గణనీయమైనదని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇంటి దగ్గర తల్లిదండ్రుల మాటకూడా వినని చిన్నారులు కూడా టీచర్లు చెబితే ఆమాటను జవదాటరు. దీనిని గ్రహించి ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. తరగతి గదుల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించాలి. పాఠశాలలు ప్రారంభమైన మొదటి పదిరోజులు ఉపాధ్యాయులు కూడా పిల్లల్లామారి వారితో స్నేహితుల్లా మెలగాలి. అప్పుడే వారికి బడి అంటే ఏర్పడిన ఒక రకమైన భయం తొలగి, ఆసక్తి కలుగుతుంది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేసి బడి పట్ల పిల్లలకు ఆసక్తి కల్గిస్తున్నారు. ఇదే వైఖరిని ప్రైవేటు పాఠశాలలూ అనుకరిస్తే బాగుంటుంది.

అందరు పిల్లలూ ఒకలా ఉండరు

పిల్లందరూ ఒకేరకమైన మనస్తత్వంతో ఉండరు. కొంతమంది ఇంటి వాతావరణాన్ని వదిలి వెళ్లడానికి ఇష్టపడకపోతే, మరికొందరికి పాఠశాల వాతావరణమంటే ఒక రకమైన భయం ఏర్పడుతుంది. మరికొందరికి పుస్తకాలంటే ఫోబియా ఉంటుంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లనని మారాం చేస్తే, అందుకు కారణాలను గుర్తించి, వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలి.

దండించొద్దు

పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ దండించవద్దని అనేక విద్యా కమిషన్లు స్పష్టంగా పేర్కొన్నాయి. ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి బెత్తంతో ప్రవేశిస్తే పిల్లలు భయపడతారు. ఇది మంచి పద్ధతి కాదని శాస్త్రవేత్తలు అంటున్నారు. పిల్లల్లో ఫోబియా పోగొట్టాలంటే వారికి మంచి మాటలు, కథలు, పాటలతో ఆకట్టుకోవాలి. పిల్లలను కొట్టి వారిని మంచి మార్గంలో పెట్టాలనుకోవడం అవివేకం. టీచర్, అందరిముందు పిల్లాడిని కొడితే, వారిలో వ్యతిరేక భావాలు (నెగెటివ్ అట్టిట్యూడ్) ఏర్పడతాయి. ఒకసారి ఉపాధ్యాయునిపై విద్యార్థికి అయిష్టత ఏర్పడితే అది ఆ చిన్న హృదయంపై హత్తుకుపోతుంది. తద్వారా పిల్లల్లో భయం వటవృక్షంలా అల్లుకుపోతుంది. తరగతి గదిలో బెత్తాన్ని ఉపయోగించకుండా చిన్నారుల మనసును దోచుకోవడం ఉపాధ్యాయుల నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది.

ఉపకరణాలు వాడాలి..

ప్రాథమిక, పూర్వ ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం ప్రస్తుతం మార్కెట్లో ఎన్నోరకాలైన ఆకర్షణీయమైన ఉపకరణాలు లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించి పిల్లలను చదువు పట్ల ఆకర్షితులను చేయవచ్చు. ఇంగ్లిష్, తెలుగు రైమ్స్, అభినయ గేయాలు, అబాకస్, పజిల్స్, ఆటబొమ్మలు, ప్లకార్డులు, రంగురంగుల బొమ్మల పుస్తకాలు లాంటివి చిన్నారులకు ఆసక్తిని రేకెత్తించి ఆలోచింపజేసే విధంగా ప్రేరేపిస్తాయి. వీటిని ఉపాధ్యాయులు తరగతి గదిలో అందుబాటులో ఉంచుకుని వాటిని వాడాలి.

సానుకూల ధోరణిని అలవరచాలి

ఒక్కోసారి పాఠశాలకు వెళ్లబోమంటూ చిన్నారులు మొండికేస్తే... తల్లిదండ్రులు సహనం కోల్పోయి వారిని ఎడాపెడా బాదేస్తుంటారు. అయితే ఇది తప్పు. దీని వల్ల మనం ఆశించిన ప్రయోజనం అటుంచి ప్రతికూల ప్రభావాలు ఉత్పన్నమవుతాయి. చిన్నారుల్లో సానుకూల ధోరణిని నింపడం ద్వారా వారిని పాఠశాలకు పంపాలే తప్ప వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తే ఫలితాలు దారుణంగా ఉంటాయి.

చదువు ప్రాముఖ్యతను వివరించాలి

బాగా చదువుకుని, ఉన్నత స్థానాలో స్థిరపడి విలాసవంతమైన జీవితాలను గడుపుతున్న వారి గురించి చెప్పడం ద్వారా చదువుకున్న ప్రాముఖ్యాన్ని, తద్వారా అనుభవించే సౌఖ్యాలను గురించి పిల్లలకు వివరించాలి. తద్వారా వారికి చదువు పట్ల ఆసక్తిని పెంపొందించేలా చేయాలి. పాఠశాలకు వెళితే అక్కడ ఆడుకునేందుకు ఉండే సౌకర్యాలు, పరికరాల గురించి తెలియ.పరచాలి. అయినా పిల్లలు వినకపోతే తల్లిదండ్రులే స్వయంగా పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లి, పాఠశాల విడిచి పెట్టేవరకూ ఇక్కడే ఉంటామని చెప్పి, ఆసమయానికి పాఠశాల వద్దకు రావాలి. తద్వారా వారిని పాఠశాలకు వెళ్ళేలా చేయాలి.

లక్ష్యాలను నిర్దేశించవద్దు

కొంతమంది తమ పిల్లలపై ఉన్న ప్రేమతో పాఠశాలలో చేర్పించకముందే నువ్వే స్కూల్ ఫస్ట్ రావాలి, నువ్వు పెద్దయ్యాక కలెక్టర్‌వి కావాలి అంటూ పిల్లలపై తమ అభిప్రాయాలను రుద్ది వారిపై శక్తికి మించిన లక్ష్యాలను ఏర్పరుస్తుంటారు. అయితే అది తప్పు. మెల్లమెల్లగా వారితో ఇంటరాక్ట్ అవుతూ బాగా చదువుకున్న వారిని ఉదహరిస్తూ, నీకూ అలాంటి టాలెంట్ ఉంది కదా, అలా చేస్తే బావుంటుంది అని చెబుతూ వారు చదువుకునేలా ప్రోత్సహించాలి.

వినోదం, ఆటపాటలూ అవసరమే..

కొంతమంది తల్లిదండ్రులు అదేపనిగా చదువు, చదువు తప్ప తమ పిల్లలకి మరో ధ్యాస ఉండొద్దనుకుంటారు. అందుకే ఆటలాడే తమ పిల్లలను కోప్పడుతూ ఉంటారు. అది సరికాదు. ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు శారీరక శ్రమ, కూడా అవసరమే. అందుకే ప్రతీ రోజు కొంత సమయం వారు ఆటలాడుకునేలా ప్రోత్సహించాలి.



విద్యాసంస్థల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికిగాను విద్యాసంస్థల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంక్షేమ వసతి గృహాల వార్డెన్‌లు, ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాలు, వసతి గృహాల్లో నిర్వహణ మరింత మెరుగ్గా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ.. పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో చెట్ల పొదల తొలగింపు, మరుగుదొడ్ల పరిశుభ్రత చేపట్టాలన్నారు. వంట గది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నిత్యవసర వస్తువులు, కూరగాయలు, సామగ్రి భద్రపరిచే స్టోర్ రూంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులతో పనులు చేయించవొద్దన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తూ.. గతేడాది కంటే భిన్నంగా ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఈ ఏడు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఈవో రాధాకిషన్, వివిధశాఖల సంక్షేమాధికారులు జగదీష్, జమ్లా నాయక్, శశికళ, నీలిమ తదితరులు పాల్గొన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలోని రూ.5 కోట్లతో నిర్మిస్తున్న ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణ, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను మంగళవారం కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు.

నిమ్జ్ భూములకు కంచె ఏర్పాటు చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

సంగారెడ్డి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిమ్జ్ భూములకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి మంగళవారం ఆయన నిమ్జ్ భూములపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి దశలో సేకరించిన భూములకు సంబంధించి రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, పరిహార చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 12,630 ఎకరాలు భూ సేకరణ లక్ష్యంగా కాగా, ఇప్పటికే 7300 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. జిల్లాలో నిమ్జ్‌కు సంబంధించి ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలాన్నారు. నిమ్జ్ భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రాజెక్టును సకాలంలో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని, పరిహార పంపిణీ వేగవతం చేసి రైతులకు న్యాయం చూడాలన్నారు. టీజీఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నిమ్జ్ ప్రత్యేకాధికారి రాజు, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్‌లో సిద్దిపేట-బీ జట్టు విజయం



విజయం సాధించిన సిద్దిపేట-బీ జట్టు

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ మండలం చీమలదారి కోనాపూర్ ఎం.ఎ.క్రికెట్ మైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు అండర్-25 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్ కొనసాగింది. మంగళవారం మెదక్-ఏ జట్టు, సిద్దిపేట-బీ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన సిద్దిపేట బీ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 46.3 ఓవర్లలో 209 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో లోహిత్‌రెడ్డి 107 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన మెదక్ ఏ జట్టు 42.1 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 37 పరుగుల తేడాతో సిద్దిపేట బీ జట్టు విజయం సాధించిందని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్

కల్హేర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అత్యంత పకడ్బందీగా చేపడుతున్నట్లు సంగారెడ్డి జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావ్ అన్నారు. కల్హేర్‌లో మంగళవారం ఇందిరమ్మ మోడల్ గృహ నిర్మాణం కోసం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో ఎలాంటి అవకతవకలకు తావు లేదని అన్నారు. అర్హులకే ఇళ్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఈఈ, ఏఈ, కల్హేర్ ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంపీఈఓ శ్రీనివాస్, గ్రామ పంచాయితీ కార్యదర్శి క్రిష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మెదక్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై జాతీయ పరిశోధన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మంగళవారం రామాయంపేట మండల పరిధి కోనాపూర్‌లో శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం గ్రామానికి చేరుకుని డ్రోన్ల ఉపయోగం వల్ల వచ్చే లాభాలపై వివరించారు. అలాగే సేంద్రియ పద్ధతుల్లో సాగు వల్ల అధిక దిగుబడి రావడంతోపాటు రైతులు ఆర్థికంగా ఎదగవచ్చునని సూచించారు. వరి సాగులో వాడే పరికరాల విషయంలో తగు జాగ్రత్తలు చేపట్టడంతో తక్కువ పెట్టుబడితో పంట అధిక దిగుబడి వచ్చే వీలుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రతాపరెడ్డి, గౌతమి, భాస్కర్, బసవరాజు లతోపాటు వ్యవసాయ శాఖ డివిజన్ ఇన్‌చార్జి, సహాయ సంచాలకులు రాజ్ నారాయణ ఉన్నారు.



గీతంలో ఎఫ్‌డీపీ విజయవంతం

పటాన్‌చెరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ వర్సిటీలో కంప్యూటర్ ఆర్గనైజేషన్, ఆర్కిటెక్చర్‌పై నిర్వహించిన వారం రోజుల అధ్యాపక వికాస కార్యక్రమం (ఎఫ్‌డీపీ) మంగళవారం విజయవంతంగా ముగిసింది. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ (ఏఐడీఎస్) విభాగాలు సంయుక్తంగా ఈ ఎఫ్‌డీపీని హైబ్రిడ్ విధానం (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)లో నిర్వహించారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ మధు ముత్యం, మహీంద్రా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ భార్గవ రాజారాం, డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆలపాటి వంటి ప్రముఖ నిపుణులు (రిసోర్స్ పర్సన్లు) హాజరయ్యారు. గీతం వర్సిటీకి చెందిన మూడు ప్రాంగణాల అధ్యాపకులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, సీఎస్ఈ డీన్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ శాంతి చిలుకూరి, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, ఏఐ, డీఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శిరీష నేతృత్వంలో, డాక్టర్ శ్రీనివాసరావు, శ్రీసౌమ్యల సమన్వయంతో కార్యక్రమం జరిగింది.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

కొండపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటను టీబీ రహిత జిల్లాగా తయారు చేయడమే లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్ అన్నారు. మండలంలోని సిరసనగండ్ల గ్రామంలో కొండపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారిలో టీబీ లక్షణాలు ఉన్నాయో లేదో తెలుసుకోవాలని, లక్షణాలు ఉన్నట్లయితే తెమడ పరీక్షలు నిర్వహించాలని, నిర్ధారణ అయినట్లయితే వారికి వెంటనే డాట్ పద్ధతి ద్వారా చికిత్స అందించాలని తెలిపారు. కార్యక్రమంలో టీబీ నియంత్ర అధికారి డాక్టర్ అరుణ్ కుమార్, కొండపాక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ఆరోగ్య సిబ్బంది, మాజీ సర్పంచ్ గూడెపు లక్ష్మారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకేది పదవి!

(5వ పేజీ తరువాయి)

వర్గానికి సంబంధించి సంజీవ్ ముదిరాజ్ అలియాస్ చిన్నా, మహిళా కోటాలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన శశికళ పేర్లను పరిగణనలోకి తీసుకున్నారు. అదేవిధంగా సంగారెడ్డి నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నేతగా ఉన్న తోపాజీ అనంతకిషన్‌ను ఆర్య వైశ్య కోటా లో చోటు కల్పించారు. కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న అనంతకిషన్, చిన్నా ముదిరాజ్ లకు కార్యవర్గంలో చోటు కల్పించడానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన వైన పాత్ర పోషించారు. పటాన్‌చెరులో బలమైన సామాజికవర్గంగా ఉన్న ముదిరాజ్‌కు అవకాశం కల్పించాలని ఆయన చేసిన విన్నపాన్ని అధిష్ఠానం స్వీకరించింది.



మెదక్, సిద్దిపేట నేతలకు నోఛాన్స్

మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సైతం టీపీసీసీ పదవులు ఆశించారు. ప్రధానంగా గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల ముఖ్యనేతలు, సీనియర్లు రేసులో ఉన్నారు. అయినా వీరికి అవకాశం కల్పించలేదు. గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి నర్సారెడ్డి, దుబ్బాక ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్‌లో మదన్‌రెడ్డి, దుబ్బాకకు సంబంధించే శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావుకు చోటు దక్కుతుందని ఆశించారు. తీరా జాబితాలో ఈ రెండు జిల్లాలకు సంబంధించిన ఏ ఒక్క నాయకుడికీ స్థానం దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత కార్పొరేషన్ చైర్మన్ల పదవుల సమయంలోనూ ఉమ్మడి మెదక్ జిల్లాకు మూడు పదవులు దక్కితే అవన్నీ కూడా సంగారెడ్డి జిల్లా నేతలనే వరించాయి. ఈసారి టీపీసీసీ పదవులు సైతం మళ్లీ సంగారెడ్డికే దక్కాయి. దీంతో మెదక్, సిద్దిపేట జిల్లాల నేతలు నారాజ్‌తో కనిపిస్తున్నారు. ఈ జిల్లాల్లో 5 నియోజకవర్గాలు ఉన్నప్పటికీ తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పదవులపై పెదవి విరుపు

గత పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అయితే తాజా టీపీసీసీ కార్యవర్గంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయనకు స్థానం కల్పించడం చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడిగా పార్టీలో ఉంటున్న తమను కాదని ఇతర పార్టీ నుంచి వచ్చిన గాలికి అవకాశం కల్పించారని పలువురు పెదవి విరుస్తున్నారు. ఒక్క పటాన్‌చెరు నియోజకవర్గంలోనే నలుగురికి అవకాశం ఇచ్చే బదులు మరో నియోజకవర్గంలో ఒక్కరికి ఛాన్స్ ఇవ్వాల్సి ఉండేదని అంటున్నారు. ఇక అందోల్ నియోజకవర్గానికి చెందిన చిన్నపట్ల సంగమేశ్వర్ పేరు సైతం తెరమీదికొచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేసి ఉపసంహరించుకున్న సంగమేశ్వర్ పేరును అనూహ్యంగా పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం. కాగా ఇప్పటికే ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ఎంఏ ఫహీమ్‌కు ఉపాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోస్టుమార్టం నిర్వహించిన తర్వాతే కొత్త కార్యవర్గంలో చోటు కల్పించాల్సి ఉండేదని సీనియర్లు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు.

ప్రతి రైతుకూ ఫార్మర్ ఐడీ

- రైతువేదికల్లో ముమ్మరంగా నమోదు
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తప్పనిసరి
- పాస్ పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు వర్తింపు
- సాంకేతిక సమస్యతో రైతులు అయోమయం



సిద్దిపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు రైతులకు వర్తింపజేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ అనే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధం లేకుండా కేవలం కేంద్రం అందించే పీఎం కిసాన్, పీఎం బీమా, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, భారత ఆహార భద్రత మిషన్ వంటి పథకాలకు మాత్రమే వర్తించనున్నది. ఫార్మర్ ఐడీ పొందేందుకు ఆయా రైతుల ఆధార్, పాస్ పుస్తకాన్ని ఆధార్‌కార్డుకు లింక్ చేసిన ఫోన్ నంబరుతో వ్యవసాయ అధికారులు, ఏఈవోలు రెవెన్యూ క్లస్టర్లలోని రైతువేదికల్లో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రీ ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా కొంతమంది రైతులకు ఒక్కటికి మించి ఇతర ప్రాంతాల్లో భూమి ఉన్నట్లయితే ఫార్మర్ రిజిస్ట్రీలలో ఐడీ నమోదు కావడం లేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీని ఆయా మండలాల రైతువేదికల్లో ఏవోల పర్యవేక్షణలో ఏఈవోలు రిజిస్ట్రీ చేస్తున్నారు. రైతుల ఆధార్‌తో అనుసంధానమైన పట్టాదారు పాస్ పుస్తకంలోని భూ వివరాలతో రైతులకు 11 అంకెల గుర్తింపుకార్డును కేటాయిస్తున్నారు. జనవరి 1 నాటికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు ఈ అవకాశం దక్కనున్నది.



పలుచోట్ల సాంకేతిక సమస్యలు

ఫార్మర్ రిజిస్ట్రీ చేసే సమయంలో పలు గ్రామాల్లోని రైతులకు సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. రైతులకు సంబంధించిన ఆధార్ అప్‌డేట్ సమస్యలు, ఒక్కటికి మించి ఇతర ప్రాంతాల్లో భూమి ఉంటే రిజిస్ట్రీ ఐడీ నమోదు కాకపోవడం, భూమి వివరాలు చూపించక పోవడంతో కొంతమేరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌లో పుట్టినతేదీ సరిగ్గా లేకపోవడం, ఇంటి పేరు, చిరునామాలు తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలు ఉన్న వారు ఆధార్ కేంద్రాలకు వెళ్లి సవరణ చేయించుకుంటున్నారు. రైతులు భూ యాజమాన్యం పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, ఫోన్ నంబరుతో ఏఈవోల వద్ద నమోదు చేసుకున్నాక ఓటీపీ ద్వారా గుర్తింపు సంఖ్య నమోదు చేస్తున్నారు.

నమోదు చేయించుకోవాలి



రైతులకు ఒక్కటికి మించి ఇతర ప్రాంతాల్లో భూమి ఉన్నట్లయితే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రీ కావడం లేదని, భూమి వివరాలు కనిపించడం లేదని నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. అలాంటి రైతులు భూమి ఉన్న ఏదో ఒకచోట ఫార్మర్ ఐడీ రిజిస్ట్రీ చేయించుకుంటే సరిపోతుంది. పాస్ పుస్తకం ఉన్న రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

- బి.పరశురామ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, నారాయణరావుపేట

రైతులకు అవగాహన కల్పించాలి



ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంపై రైతులకు అవగహన కల్పించాలి. కొంతమంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఫార్మర్ ఐడీ గుర్తింపుతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించి చైతన్యం నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీతో రైతులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

- అమరేందర్‌రెడ్డి, రైతు, మల్యాల

న్యూస్ బాక్స్

సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చు

- తొగుట సీఐ లతీఫ్

రాయపోల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో చాలా వరకు నేరాలను నియంత్రించవచ్చునని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎస్ఐ రఘుపతితో కలిసి రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆలయాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చునని పేర్కొన్నారు.

సీనియర్ కార్యకర్తకు కొమ్మూరి నివాళి

కొమురవెల్లి, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంసాగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త అక్కెనపల్లి బాలకృష్ణ రెడ్డి(69) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఏమ్మేల్యేడీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన చైర్మన్

హుస్నాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని నగర గ్రంథాలయానికి రూ. 30 లక్షలు మంజూరు కావడంతో మంగళవారం జిల్లా గ్రంథాయ సంస్థ చెర్మన్ కేడం లింగమూర్తి భవనాన్ని పరిశీలించారు. భవనంలో మిగిలి ఉన్న పనులను పూర్తి చేయడంతో అందులో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకరావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

భజరంగ్‌దళ్ మండల కమిటీ ఎన్నిక

కుకునూరుపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల బజరంగ్ దళ్ కమిటీని ప్రకటించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కొంతం రాజు, ఉపాధ్యక్షులుగా బోని నర్సింలు, రాజు, మహేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం హాజరయ్యారు. అదే విధంగా కుకునూరుపల్లి గ్రామ కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా ఇండ్ల శ్రీశైలంను ఎన్నుకున్నారు.

దుర్గయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

కొండపాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాకు చెందిన హిందీ ఉపాధ్యాయుడికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది.వసుంధర విజ్ఞాన వికాస మండలి సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన 32వ వార్షికోత్సవ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు బైతి దుర్గయ్య ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

ఆలయానికి గ్రానైట్ అందజేత

సిద్దిపేట రూరల్,జూన్ 10(ఆంధ్రజ్యోతి): చింతమడక గ్రామ పంచాయితీ అంకంపేట గ్రామంలో మహంకాళి అమ్మవారి ఆలయానికి రూ. 2 లక్షల విలువ చేసిన గ్రానెట్‌ను బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అందజేసినందుకు మంగళవారం ఆలయ కమిటి మరియు బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయడంతో ఆలయాన్ని నిర్మించారు.

ఉచిత యోగా శిక్షణ



ఉచిత యోగా శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేటలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగాసొసైటీ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న ఉచిత యోగా శిక్షణ తరగతులకు సంబంధించి వాల్ పోస్టర్లను మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గణేష్ నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, సిద్దిపేట పబ్లిక్ సర్వెంట్స్ హోం, హౌసింగ్ బోర్డు కాలనీలోని మాడ్యులస్ స్కూల్, షిరిడి సాయిబాబా గుడి సమీపంలోని వ్యాస మహర్షి యోగా కేంద్రం, సిద్దిపేట బురుజు వద్ద నున్న నర్సింగ్ కళాశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని ఆరోగ్యాభిలాషులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగా అభ్యసనం ఆరోగ్యానికి రక్షణ కవచంగా నిలుస్తుందని చెప్పారు. ఈ తరగతుల ద్వారా ఆత్మీయులకు యోగా విద్య ఇవ్వడం అద్భుత బహుమతిగా ఉంటుందన్నారు. కుల, మత, రాజకీయ, లింగ భేదాలకు అతీతంగా యోగా విద్య అందరికీ అత్యవసరమన్నారు. పెరుగుతున్న రకరకాల కాలుష్యాలు, అనారోగ్యాల నుంచి రక్షించుకోవడానికి యోగా అద్భుత సాధనమని తెలిపారు. భారతీయ సంప్రదాయ యోగా విద్య నేడు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ శిక్షణ శిబిరాల్లో శిక్షణ తీసుకున్న వారు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న సిద్దిపేట బాలికల కళాశాల ఆవరణలోని మైదానంలో జరిగే సామూహిక యోగ ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

మద్దూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు మెరుగైన సాగు పద్ధతులు అవలంభించడం ద్వారానే అధిక దిగుబడులు సాధించే వీలుంటుందని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త టి. శ్రీజయ తెలిపారు. మంగళవారం ధూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో మద్దూర ు ఏవో రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి హజరై మాట్లాడారు. వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు యూరియా వాడకం, అవసరాన్ని బట్టి రసాయనిక ఎరువుల వినియోగం, నేల సంరక్షణ, పచ్చిరొట్ట ఎరువులు వాడకాలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలతో పాటు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త సతీష్ తెలిపారు.

మా కళాశాలలో చేరండి

(5వ పేజీ తరువాయి)

ఉన్న ఈ కళాశాలకు రవాణా సౌకర్యం ఇబ్బందిగా ఉన్నది. కళాశాల సమయంలో ఒక బస్సును జగదేవ్‌పూర్ బస్టాండ్ నుంచి కళాశాల వరకు నడిపితే చాలా మంది విద్యార్థులు చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు పలువురు తమకు చెబుతున్నారని కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నూతనంగా కోర్సులు

మా కళాశాలలో ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం ఎంఈసీ, పారామెడికల్ కోర్సులు కూడా ప్రవేశపెడుతున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలి.

-బానోతు రాజన్న, కళాశాల ప్రిన్సిపాల్

పాఠశాలలకు చేరిన బుక్స్, యూనిఫామ్స్



ఎంఆర్సీ కార్యాలయానికి చేరుకున్న టెస్ట్ బుక్స్, నోటుబుక్స్

మద్దూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌బుక్స్, వర్క్ బుక్స్‌తో పాటు విద్యార్థుల యూనిఫామ్స్ ఎంఆర్సీ కార్యాలయానికి చేరినట్లు ఎంఈవో వరదరాజు తెలిపారు. మంగళవారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 1150 మంది విద్యార్థులకు టెస్ట్ బుక్స్, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్‌తో పాటు ఒక జత యూనీఫామ్ వచ్చేశాయన్నారు. పాఠశాల ప్రారంభం రోజే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తారని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు టెస్ట్‌బుక్స్, వర్క్ బుక్స్‌తో పాటు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు టెస్ట్‌బుక్స్‌తో పాటు నోట్ బుక్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మహిళల రక్షణకు పెద్దపీట



ఎర్రవల్లి కాలనీ వాసులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పై ఉమారెడ్డి

గజ్వేల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణకు పెద్దపీట వేసినట్లు గజ్వేల్ ఏఎస్పై ఉమారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఎర్రవల్లిలో ప్రజలకు మహిళల చట్టాలపై, సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతలపై ఆయన అవగాహన కల్పించారు. ఆయనవెంట షీటీం బృందం సభ్యులు మహేందర్‌రెడ్డి, శ్యామల, రాంచంద్రా రెడ్డి, మహేశ్, భరోసా సెంటర్ సిబ్బంది హారిత, వినోద తదితరులున్నారు.

గ్రామాల్లో బడి బాట కార్యక్రమం



కొడకండ్ల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అక్కన్నపేట/గజ్వేల్‌రూరల్/దుబ్బాక,జూన్10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని దుబ్బాక మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోధ్యాయుడు మధుసూదన్ అన్నారు. మంగళవారం దుబ్బాకలోని ఎస్సీకాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలతో కూడిన మెరుగైన విద్యను అందిస్తున్నారని కొడకండ్ల గ్రామ ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం అన్నారు. మంగళవారం కొడకండ్లలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను గురించి తల్లిదండ్రులకు, గ్రామస్థులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి, రేగొండ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి

మద్దూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం సిబ్బందికి సూచించారు. మంగళవారం మద్దూరు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులతో పాటు సిబ్బంది పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. 100 కాల్ డయల్ రాగానే వెంటనే స్పందించాలని సూచించారు. కేసులలో పారదర్శకంగా పరిశోధన చేయాలన్నారు. విపీవో వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని సూచించారు. అంతకు ముందు కొండాపూర్ శిబ్బి తండా. బెక్కల్, బైరాన్‌పల్లి, వల్లంపట్ల, రేబర్తి, లద్నూరు మారమ్మముల, సలాఖ్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

జగదేవ్‌పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య పెంచేందుకు అమ్మమాట.. అంగన్‌వాడీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీడీపీఓ సరిత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

రాయపోల్ మండలం వడ్డెపల్లిలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, మాజీ సర్పంచ్ చిరంజీవి, రవి, లక్ష్మినర్సు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రూరల్ అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మంచి పోషక విలువలతో కూడిన పౌష్టికహరం అందించడం జరుగుతుందని ఐసీడీసీసూపర్వైజర్ వసంత చిన్నారుల తల్లిదుడురలకు సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో అంగన్వాడి బడి బాటా కార్యక్రమంలో నిర్వహించారు.

రైతు భరోసాలో కాంగ్రెస్ విఫలం

ములుగు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట సాగుకు రైతు భరోసా నిధులు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు భరోసా నిధులు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వర్షాలు కురిసే సమయం దగ్గర పడిందని ఇప్పటివరకు రైతు బరోసా నిధులు అందించలేకపోయారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు సరైన సమయానికి రైతు భరోసా నిధులు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా సాగేలా చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు భరోసా విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేని యెడల రైతుల పక్షాన బీఆర్ఎస్ ధర్నా కార్యక్రమాలు చేపడతామన్నారు.

కేసీఆర్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడానికే రేవంత్ యత్నం

గజ్వేల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడానికే రేవంత్ యత్నిస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ అంటేనే కాళేశ్వరం అని, కాళేశ్వరం అంటేనే తెలంగాణ గుండెచప్పుడు అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఖర్చు చేసింది రూ.94వేల అయితే లక్ష కోట్ల అవినీతి అని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారని, అర్థం పర్థం లేకుండా నోటికి వచ్చిన ఆరోపణలు చేస్తూ, ఎన్నికల ముందు ఇష్టారీతిన హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక విజన్ లేకుండా టైంపాస్ పాలన చేస్తూ, డైవర్ట్ రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రేవంత్‌రెడ్డి యత్నిస్తున్నారని, ఈ క్రమంలో కాళేశ్వరంపై కమీషన్ వేసి నోటీసులు ఇప్పించి పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. తనను జైళ్లో పెట్టారని అంటున్న రేవంత్ ఓటుకు నోటు కేసులో డైరెక్ట్‌గా దొరికిపోయారని, కానీ కేసీఆర్ చేసిన తప్పేంటని ప్రశ్నించారు.

సామాజికన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

గజ్వేల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సామాజికన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ దళితులు, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒకటి, రెండు శాతం ఉన్న కులాలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వగా, అందుకు భిన్నంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు దళితులు, బీసీలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. చారిత్రక నిర్ణయాలతో పేదప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి మరింత ఉత్సాహంతో కొత్త కొత్త పథకాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, పేదలకు ఒకేసారి మూడు నెలల సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను బయటపెడుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత కొత్త, కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తత అవసరం

సిద్దిపేట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా గుర్తుతెలియని అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అమాయక ప్రజలను చూసి ఇది ఇస్తాం, అది ఇస్తాం మాయ మాటాలు చేప్పి మోసం చేస్తుంటారు అలాంటివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట రూరల్ ఎఎస్సై పరమేశ్వరి ఉపాధి హామీ కూలీలకు సూచించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగూండవెల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి షీ టీం బృందం చట్టాల పై తఅవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ ప్రభుత్వం పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ముఖ్యం ఫోన్‌లు వాడేవారు మీ ఫోన్ ఎధైన తెలియని నెంబరు నుంచి ఫోన్ వస్తే మీ వివరాలు చెప్పవద్దన్నారు. మాటాల్లో పెట్టి మీ బ్యాంకు వివరాలు అడిగి అందులోని నగదును క్షణాల్లో మాయం చేస్తారని సైబర్ నేరాల పట్ల అర్పమత్తంగా ఉండలని చెప్పారు. గ్రామాల్లో ఎవరైన డ్రగ్స్, గంజాయి, వంటి మత్తు పదార్థలు విక్రయించిన, తీసుకన్న వారు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీస్ నెంబర్ 100 డయాల్ చేసి వివరాలు చేప్పాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

భూ సమస్యల్ని పసరిష్కరించాలి

-సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

మద్దూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూ భారతిలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తహసిల్దారు రహీంకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. గతంలో రైతులు కొనుగోలు చేసినభూములకు క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గతంలో ప్రభుత్వం అందించిన భూములకు పట్టాలతో పాటుగా పాత పాసు బుక్కులు ఉన్నవారికి పట్టాలు అందించాలని కోరారు. ఈ కార్యకమంలో మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, కనకయ్య, పర్శరాములు, వెంకటయ్య, కుమార్ మల్లయ్య ఉన్నారు.

అందుబాటులోకి పచ్చిరొట్టె విత్తనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుకునూరుపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజుల క్రితం పచ్చిరొట్టె విత్తనాల కొరతపై ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించిన డిమాండ్ ఎక్కువ సరఫరా తక్కువ కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారులు మండలానికి మరో 100 జీలుగా సంచులు మంజూరు చేశారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతుకు కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ సేవా కేంద్రం నుంచి కొనుగోలు చేయవచ్చని అధికారులు తెలిపారు.

స్వశక్తి సంఘాల మహిళలకు వైద్య శిబిరం

హుస్నాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపాలిటీలో వంద రోజుల కార్యక్రమంలో బాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్వశక్తి సంఘాల మహిళలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం పట్టణ శివారులోని మురికి కాలువల్లో పేరుకపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. 30 మంది స్ట్రీట్ వెండర్స్‌కు హెల్త్ ఇన్సూరెన్స్‌లు చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, తదితరులున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ నెల రోజులు..

మర్కుక్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మేకల కనకయ్య అన్నారు. మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో వేసవి సెలవుల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్యాక్స్ వైస్ చైర్మెన్ కమ్మరి బాలరాజులతో కలిసి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కాలేజీలకు వేసవి సెలవులు వచ్చిన సందర్భంగా విద్యార్థులు ఈతలకు వెళ్లి ప్రాణాలు కోల్పోతు, గ్రామాలలో గంజాయి బెట్టింగులకు పాల్పడుతు క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోతున్న యువకుల కోసం ఈ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు ట్రోఫీలతో బహూకరించారు. ప్రథమ బహుమతి 20వేలు, ద్వితీయ బహుమతి 10వేలు దాత అంజిరెడ్డి రాలేకపోవడంతో ఆయన ప్రతినిధిగా ఎర్రవల్లి బాలరాజు చేతుల మీదుగా విజేతలకు నగదు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొమురవెల్లి, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం మండల విద్యాధికారి బొమ్మగోని రమేష్ అమ్మ అదర్శ కమిటీ చైర్మెన్లు,పలు రాజకీయ పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లితండ్రులు,మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. గ్రామాలలో ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపే విదంగా ప్రజా ప్రతినిధులు,ఆయా గ్రామస్థులు చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

●అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం కింద గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) అబ్దుల్ హమీద్ ప్రజలకు సూచించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును సందర్శించి సదస్సు నిర్వహణ పై, రైతులతో మాట్లాడారు. భూ సమస్య ఎదైన ఉంటే గ్రామంలోకి వచ్చిన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, రెవెన్యూ సదస్సులో మీరు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఏదైన సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశం, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సీనీయర్ అసిస్టెంట్ లలితా, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో అవగాహన కార్యక్రమం



కరపత్రం విడుదల చేస్తున్న అధికారులు

కుకునూరుపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సులువైన అధిక దిగుబడిపై రైతులకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కుకునూరుపల్లి రైతు వేదికలో వికసిన కృషి సంకల్ప కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంలో అనుసరించాల్సిన వివిద పద్దతులు మరియు పంటలపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జయశంకర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌లు, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పంటలలో యూరియా వాడకం తగ్గించడం, రసాయనాలను అవసరం మేరకు ఉపయోగించడం, రసాయనాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల భూమి ఇలా సారవంతం కోల్పోతుందని, ఖరీఫ్‌లో రైతులు ఉపయోగించే విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ పల్లవి, మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మధ్యాహ్నభోజన, పారిశుద్ధ కార్మికులకు శిక్షణ కార్యక్రమం
- మండల విద్యాధికారి సునీత



ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన, పారిశుద్ధ కార్మికులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం

వర్గల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన బోజనం అందించాలని మండల విద్యాధికారి సునీత పేర్కొన్నారు. మంగళవారం వర్గల్ మండల వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు, పారిశుద్ధ కార్మికులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల కోసం వంట చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వంట పాత్రలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కూరగాయాలలను ఒకటికి రెండు సార్లు శుభ్రంగా కడగాలన్నారు. అలగే పారిశుద్ధ కార్మికులు పాఠశాల గదులను శుభ్రంగా ఉంచాడంతో పాటు విద్యార్థులకు మంచినీటి సౌకర్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. పాఠశాల పరిసరాలు, వాష్ బేసన్, మూత్రశాలలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కనకరాజు, ఉపాధ్యాయులు కృష్ణ, సౌజన్య, సుధారాణీతో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, వంట కార్మికులు, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న కార్మికులే పాఠశాలకు దిక్సూచి



మర్కుక్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణ పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం నిర్వహణపై మండలంలోని ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజన కార్మికుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి వెంకటరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని తూచా తప్పకుండా పాటించాలన్నారు.